క్లుప్తంగా

గొల్ల బాబూరావుకు ఘన స్వాగతం



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్

సీతంపేట: వైఎస్సార్‌సీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై మొదటి సారి విశాఖపట్నం విచ్చేసిన గొల్ల బాబూరావుకు శుక్రవారం విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో పార్టీ శ్రేణులతో కలిసి జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్ ఘన స్వాగతం పలికారు. శాలువాతో ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జాబ్‌మేళాలో 126 మంది ఎంపిక

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. సుమారు 13 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 905 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 680 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 126 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఆయన అన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

మల్కాపురం: యువత రాత్రి సమయంలో అధికంగా పబ్బులు, క్లబ్బులు, సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి ఉండేందుకు ఇష్టపడుతుంటారని కేరళకు చెందిన ప్రముఖ సర్వే పరిశోధకుడు నితిన్ అన్నారు. రాత్రి సమయంలో యువత ఎటువంటి అలవాట్లు పాటిస్తున్నారో తెలుసుకునేందుకు ఓ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల వద్ద జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి సహకారంతో కళాశాల విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ తన సర్వేలో భాగంగా వివిధ కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులను సర్వే చేసినట్టు చెప్పారు. యువత తన యవ్వన జీవితంలో చెడు అలవాట్లతో వృథా చేయకుండా దృష్టిపెట్టి ఉన్న శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో రక్తదాన శిబిరం



రక్తదాతలతో మాట్లాడుతున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 200 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. దాతలను సీఎండీ హేమంత్‌ఖత్రి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరో వ్యక్తిని కాపాడవచ్చునని సూచించారు. షిప్‌యార్డ్ ప్రధాన వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



గ్రీన్‌బెల్ట్ పార్కులో వ్యాయామం చేస్తున్న మహిళలు



మారియట్ హోటల్ ఎదురుగా గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్



వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు

ఆహ్లాదానికి C/O గ్రీన్‌బెల్ట్



జిందాల్ బిల్డింగ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న పార్కు

- సిద్ధమైన మర్రిపాలెం గ్రీన్ బెల్ట్
- ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో క్యూ కడుతున్న జనం
- పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- సౌకర్యవంతంగా వాకింగ్ ట్రాక్

పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్న గ్రీన్‌బెల్ట్‌లు

మర్రిపాలెం వుడా లేఅవుట్ రూ.20 లక్షలు(ఇప్పటికే అభివృద్ధి చేశారు)	మారియట్ హోటల్ ఎదురుగా గ్రీన్‌బెల్ట్ రూ.19.70 లక్షలు
గ్రీన్‌బెల్ట్‌లో సెంట్రల్ లైటింగ్, ఇతర సౌకర్యాల కోసం : రూ.43 లక్షలు	లలిత ఎలైట్ గ్రీన్‌బెల్ట్ రూ.10 లక్షలు
జిందాల్ బిల్డింగ్ వద్ద గ్రీన్ బెల్ట్ : రూ.19.70 లక్షలు	అపర్ణ అపార్ట్‌మెంట్ గ్రీన్‌బెల్ట్ రూ.10 లక్షలు

విశాఖ విద్య: నాడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉన్న గ్రీన్ బెల్ట్ నేడు ఆహ్లాదానికి కేరాఫ్‌గా మారింది. పచ్చని మొక్కలతో పాటు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతో ఇవి సందడిగా మారాయి. విశాఖ నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి జీవీఎంసీ 52వ వార్డులోని ఎన్ఏడీ ఫ్లై ఓవర్ స్వాగతం పలుకుతోంది. అలాంటి ఈ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ప్రభుత్వ పెద్దలు, జీవీఎంసీ అధికారుల సమన్వయంతో వార్డులో ఖాళీ ప్రదేశాలను ఆహ్లాదం పంచేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే మర్రిపాలెం వుడా లే అవుట్ వద్ద గ్రీన్ బెల్ట్‌ను అభివృద్ధి చేశారు. అదనపు హంగులు సైతం కల్పించారు. మర్రిపాలెం వుడా లే అవుట్ గ్రీన్ బెల్ట్‌లో 'వనిత వాకర్స్' పేరిట మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ నగరంలో ఇదో రోల్ మోడల్‌గా నిలువనుంది.

పట్టించుకోని గత ప్రభుత్వం

గత ప్రభుత్వంలో హైవే పై ప్రయాణించే వారు రోడ్డు పక్కన ఆగాలంటే భయాందోళనకు గురయ్యే పరిస్థితులు ఉండేవి. ఆ ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు సైతం జరిగేవి. వీటిని అభివృద్ధి చేయాలని వార్డు పరిధిలోని కాలనీ వాసులు మొరపెట్టుకుంటున్నా టీడీపీ ప్రభుత్వంలో పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మౌలిక సౌకర్యాలు పెంపొందించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు జీవీఎంసీ ద్వారా నిధులు కేటాయింపు జరుగుతోంది.

వ్యాయామ పరికరాలతో క్రేజ్

మర్రిపాలెం వుడా లేఅవుట్ వద్ద అభివృద్ధి చేసిన గ్రీన్‌బెల్ట్ వ్యాయామశాలగా మారింది. వాకింగ్ ట్రాక్‌లను తీర్చిదిద్దడంతోపాటు వివిధ రకాల వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళలో గ్రీన్‌బెల్ట్‌లు జనసంచారంతో సందడిగా కనిపిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు గ్రీన్‌బెల్ట్‌కు క్యూ కడుతున్నారు.

ప్రజల అవసరాలు తీర్చాలనేది లక్ష్యం



గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సహకారం ఎంతో ఉంది. వీటిని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. గ్రీన్‌బెల్ట్‌లో మోడల్ లైటింగ్‌తో పాటు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. ప్రజల అవసరాలు తీర్చాలనేది నా లక్ష్యం. మహిళల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

అందరికీ ఉపయోగపడేలా..



అందరికీ ఉపయోగకరంగా ఉండేలా గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేస్తున్నాం. రాత్రి 8గంటల వరకు గ్రీన్‌బెల్ట్ ఏరియాను ప్రజానీకం వినియోగిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులు సకాలంలో పూర్తి చేసేందుకు శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఉష, అసిస్టెంట్ ఇంజినీర్,జీవీఎంసీ జోన్ 5

ఎన్ఏడీ ప్రాధాన్యాన్ని గుర్తించారు



గ్రీన్‌బెల్ట్ సుందరంగా తీర్చిదిద్దడం వల్ల అందరికీ సౌకర్యవంతంగా ఉంది. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా గడుపుతున్నారు. ఎన్ఏడీ ప్రాధాన్యత దృష్ట్యా ఈ ప్రాంత అభివృద్ధికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎంతో కృషి చేస్తున్నారు.

– బీఎస్. కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్

ఇన్నాళ్లకు కల నెరవేరింది



మర్రిపాలెం వుడా లే అవుట్ వాసులకు సౌకర్యవంతంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఎంతో కాలం నుంచి విన్నవిస్తున్నాం. కానీ గతంలో ఎవరూ పట్టించుకోలేదు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల ఇన్నాళ్లకు మా కోరిక నెరవేరింది.చాలా సంతోషంగా ఉంది.

– కె. నాగేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మర్రిపాలెం

ఆరేళ్లు దాటిన చిన్నారులు పాఠశాలలో ఉండాలి

- డీఈవో చంద్రకళ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో చంద్రకళ

మల్కాపురం: ఆరేళ్లు దాటిన బాల,బాలికలు బడిలో ఉండాలని విశాఖ జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంపీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె తొలుత పాఠశాల తరగతి గదులు, అక్కడ విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా లేదా తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన వద్ద విద్య నేర్చుకుంటున్న విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, ములగాడ మండల విద్యాశాఖ అధికారులు డి.వి.త్రినాథరావు, ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్ ప్రారంభం



విద్యార్థులతో డీఈవో చంద్రకళ

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన భవిత సెంటర్‌ను డీఈవో ఎల్. చంద్రకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత సెంటర్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వారానికి రెండు రోజులు పిల్లలకు ఫిజియో థెరఫీ చేస్తారని తెలిపారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ భవిత సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల నోటు పుస్తకాలను, ఎస్ఏ–4 పరీక్షలు జరుగుతున్న తీరును డీఈవో చంద్రకళ పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, డీపీవో అప్పలనాయుడు, ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్, హెచ్ఎం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలకు అభివృద్ధి కనిపించదా..?



60వ వార్డులో రూ.4 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను చూపుతున్న పత్నీరావు

మల్కాపురం: గడిచిన రెండేళ్లలో ఎన్నడూ లేని విధంగా పశ్చిమ నియోజకవర్గ పారిశ్రామిక ప్రాంతంలోని 7 వార్డుల్లో సుమారు రూ.20 కోట్లపైగా వివిధ అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టిందని, స్థానిక టీడీపీ, జనసేన నాయకులకు అవి ఏమాత్రం కనిపించడం లేదని వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి శరగడం పత్నీరావు మండిపడ్డారు. ఆయా వార్డుల్లో నేడు మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కళ్లుండి చూడలేక గాంధారి పాత్ర పోషిస్తున్నారా.. అని ప్రతిపక్షాలను ఎద్దేవా చేశారు. రెండు రోజుల కిందట మీడియా సమావేశం ద్వారా టీడీపీ, జనసేన పారిశ్రామిక ప్రాంత నాయకులు వైఎస్సార్‌సీపీ పాలనలో పశ్చిమలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపణలు చేయడంపై ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం కొందరు మీడియా ప్రతినిధులను ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లి వారికి అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను చూపించారు. 60వ వార్డు శ్రీహరిపురంలో జరిగిన కార్యక్రమంలో పత్నీరావు మాట్లాడుతూ రూ.2 కోట్లతో 58, 59 వార్డుల్లో ఆధునిక వసతులతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సుమారు రూ.5 కోట్లతో వివిధ వార్డుల్లో సీసీ, బీటీ రోడ్లు, సీసీ కాలువలు నిర్మించడం, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, రక్షణ గోడల నిర్మాణాలు.. ఇలా అనేక అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చేసి చూపించారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గణబాబు మాదిరిగా ఆనంద్‌కుమార్ శిలాఫలకాలకే పరిమితం కాలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 60వ వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ వైద్యుడు శ్రీకాంత్‌కు గోల్డ్ మెడల్



సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు పరిధి నాయుడు తోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్‌కు ఆర్ఏ బాల చంద్ర గోల్డ్ మెడల్ లభించింది. నాసిక్‌లో శుక్రవారం జరిగిన మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్నాతకోత్సవ వేడుకల్లో ఎంఎస్(నేత్ర వైద్యం)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తొలిస్థానంలో నిలిచిన డాక్టర్ శ్రీకాంత్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిటైర్డ్ వైస్ చాన్సలర్ లెఫ్టినెంట్ జనరల్ మాధురీ కనిట్కర్ శ్రీధర్‌కు పురస్కారం అందజేశారు. డాక్టర్ శ్రీకాంత్ విజయనగరంలోని మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి ఎంబీబీఎస్ పట్టభద్రుడయ్యారు. 2019–22లో పూణేలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కళాశాలలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేశారు. గోల్డ్‌మెడల్ సాధించిన డాక్టర్ శ్రీకాంత్‌ని శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగారాజు,వైద్యులు, సిబ్బంది అభినందించారు.

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

మల్కాపురం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పలువురు రోగులకు అవసరమైన స్క్రీనింగ్ టెస్టులు ఉచితంగా చేశారు. మల్కాపురం ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారి పర్యవేక్షణలో శుక్రవారం శ్రీహరిపురం కళంజియా కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైద్య నిపుణులు సుభద్ర మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ ఎప్పటికప్పుడు గైనిక్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నెలసరిలో ఏమైనా మార్పులు, సమస్యలు వస్తే వెంటనే గైనకాలజిస్టుల సలహా తీసుకుని మందులు వాడాలన్నారు. సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'సిద్ధార్థ రాయ్' యూనిట్ సందడి



సిద్ధార్థ రాయ్ సినిమా హీరో దీపక్ సరోజ్, హీరోయిన్ తన్వితో బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: గోపాలపట్నం మౌర్య సినిమా హాలులో సిద్ధార్థరాయ్ సినిమా రిలీజ్ సందర్భంగా చిత్ర యూనిట్ సందడి చేసింది. తెలుగు సినీ కథానాయకుడు పేడాడ దీపక్ సరోజ్, హీరోయిన్ తన్వి నేగి శుక్రవారం హాలును సందర్శించారు. వీరితో పాటు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు హాజరయ్యారు. దీపక్ సరోజ్‌కు పూల మాలలతో స్వాగతం పలికారు. సినిమా చూసేందుకు వచ్చిన వారితో యూనిట్ సభ్యులు సినిమా విశేషాలను పంచుకున్నారు. వీరితో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణి కుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



బిర్లా జంక్షన్ వద్ద స్టాపర్లను ప్రారంభిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్ తదితరులు

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం సాయంత్రం బిర్లా జంక్షన్ వద్ద ఉన్న డెకాథలిన్ స్పోర్ట్స్ షోరూం వద్ద ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎ.ప్రసాద్‌రావుతో కలిసి స్టాపర్లను ప్రారంభించారు. జంక్షన్లలో ప్రమాదాలను తగ్గించేందుకు, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లను ఏర్పాటు చేసినట్టు ఏసీపీ తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు కొనసాగించాలని, ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, వేగంగా వాహనాలను నడపకూడదని, లేకుంటే కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులకు సహకరించి స్టాపర్లను అందించిన వారికి అభినందనలు తెలిపారు. ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్, ఎస్ఐ రామకృష్ణ, ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ బాలరాజు, కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ అన్వర్ తదిరతులు పాల్గొన్నారు.

26న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ బి. శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 27 ఏళ్ల లోపు వయస్సు ఉండి ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ 2020–21,2021–22, 2022 –23 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువకులు డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ ట్రైనింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ హెటిరో డ్రగ్స్ సంయుక్తంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఆసక్తి కలగిన యువకులు బయోడేటా, సర్టిఫికెట్స్ తో 26న కళాశాలకు హాజరు కావాలని సూచించారు.

27న కేజీహెచ్‌లో పీఐసీయూ ప్రారంభం

- ప్రారంభోత్సవం చేయనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని
- రూ.80 లక్షల వ్యయంతో పలు సౌకర్యాల ఏర్పాటు



పిల్లల వార్డులో కొత్తగా నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్



యూనిట్‌లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

మహారాణిపేట : కేజీహెచ్ పిల్లల వార్డులో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(పీఐసీయూ) ఈ నెల 27న ప్రారంభం అవుతుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ యూనిట్‌ను ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మొత్తం 40 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ఒక ఏడాది నుంచి ఏడు సంవత్సరాల లోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం చికిత్స అందిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ నిధులు రూ. 20 లక్షలు, కేజీహెచ్ నిధులు రూ. 20 లక్షలు, కలెక్టర్ మల్లికార్జున అందించే సీఎస్ఆర్ ఫండ్ రూ. 40 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. వెంటిలేటర్ వంటి సదుపాయాలు పొందుపరుస్తున్నామని తెలిపారు. అలాగే కేజీహెచ్‌లో 120 సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు.

ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు

కొమ్మాది: నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి అని టీడీపీ నేత నజీర్ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రభుత్వ పథకాలను దళారీ వ్యవస్థలు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసి, పేదవారికి అండగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారం దోచుకునే వారని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి, లంచాలకు తావు లేకుండా వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి వైఎస్ జగన్ జన హృదయ నేతగా నిలిచారన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 24 వేల కోట్లు అందజేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిది అన్నారు. నాడు చంద్రబాబు పాలనలో షాదీ తోఫా కింద రూ. 50 వేలు అందిస్తే నేడు సీఎం జగన్ రూ. లక్ష అందిస్తున్నారని, 2022–23 హజ్ యాత్రలకు వెళ్లిన 2977 హాజీలకు రూ. 20కోట్ల 3 లక్షలు ఖర్చు పెట్టిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు.

మైనారిటీల పక్షపాతి సీఎం జగన్

ఆక్రమణలకు గురైన 32 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు స్వతంత్ర అధికారాలు ఇస్తూ వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన మైనారిటీల పక్షపాతి సీఎం జగన్ అని కొనియాడారు.

సంతాన సాఫల్య లోపాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు ప్రావీణ్య

గోపాలపట్నం: గోపాలపట్నంలోని బెహరా ఆస్పత్రిలో సంతాన సాఫల్యం లోపాలపై శుక్రవారం అవగాహన శిబిరం నిర్వహించారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రావీణ్య సంతానలేమికి కారణాలను వివరించారు. శిబిరంలో సుమారు 60 మంది దంపతులు హాజరై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవితేజా మాట్లాడుతూ శిబిరం ద్వారా ఆత్మన్యూనత భావాలు తొలగించి మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.